# వెలుగును మింగిన చీకటి ——

సూర్యోదయమై 2 గంటలు దాటింది. మంచినీటి బావిచుట్టూ అమ్మలక్కలు మూగారు. ఊరి బయట పాడు బడిన గుళ్ళోకి విచ్చేసిన స్వామిని గురించి ప్రశంసిస్తున్నారు కొందరు. ఆశ్చర్యంగా ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు మరికొంత మంది. ఈ విచిత్ర మేమిటమ్మా అనుకుని బుగ్గలు నొక్కుకొన్నారు కొంతమంది.

బావిగట్టుమీద బిందె తోముతున్న మీనాక్షి 'ఎవరే ఆస్వామి' అడిగింది.

జనవరి '67 చుక్కానిలో ప్రచురితము

'ఎవరోనే?......క్రొత్తగా వచ్చారట. నేనూ చూడ లేదు. దేవుడులాగ అన్నీ నిజం చెపుతున్నారట!'' అంది ప్రక్కనే వున్న చంపకమ్మ.

''ఎవరో అంటావేమే?... నేను చూచికూడావస్తే?— మా మేనల్లుడి కొడుక్కి పిచ్చి పడితేను... వెళ్ళి వీభూతి పెట్టించుకొచ్చాం? వెంటనే సుగుణం కనిపించింది'' అంటూ అందుకుంది ఓ జానకమ్మ.

నిండిన నీళ్ళబిందె చంకబెట్టుకుని ''వస్తానే పిన్నీ'' అంటూ మీనాక్షి ఇంటిముఖం పట్టింది.

స్వామిమాట విన్నప్పటినుండీ యెట్లాగయిన సరే వెళ్ళి చూచిరావా లనుకుంది. మనసులోవున్న కోరిక చెప్పి, ఏదయిన మంత్రోపదేశం పొంది, తరించి తల్లి కావాలను కుంది మీనాక్షి.

మీనాక్షి కాపురానికొచ్చి పదేళ్ళు దాటింది. మని షిలో సంతోషం లేదు. మనసులో వుత్సాహం లేదు. పిల్లల మీద మమకారంకొద్దీ రోజురోజుకు మనిషి శుష్కించి పోతున్నది. విచారవదనంతో అహోరాత్రాలూ ఒక బిడ్డను ప్రసాదించ మంటూ భగవంతుని పరిపూర్ణ హృదయంతో ప్రార్థించేది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఫలితం కన్పడక పోయేసరికి బరువెక్కిన హృదయంతో గుండె రాయిచేసు కోక తప్పిందికాదు.

మధ్యాహ్న సమయం భర్త పొలంనుండి వచ్చాడు. భర్తకు భోజనం వడ్డిస్తూ ''ఏమండీ? మన వూరికి బయట పాడు

బడ్డ గుళ్ళోకి యెవరో స్వామి వచ్చారట ... విన్నారా?" హెచ్చరించింది మీనాక్షి.

"అదే వినికడిగా వుందే......చాలా మహత్తు కల వాడట, యెన్నో యేళ్ళుగూడా లేవట చిన్నవాడే అనుకుంటు న్నారు.

"మనంకూడా వెళ్ళి చూచివద్దామా ?"

"నీ వెఱ్ఱిగాని మనకు పిల్లలు లేకపోతే స్వామి ఏం చేస్తాడే? ఏదో యింత వీభూతి మంత్రించి యిచ్చి వెళ్ళి రమ్మంటాడు.--అయినా ఇట్లా మనం ఎంతమందిని దర్శించ లేదు కనుక ?"

"పోనీలెండి మనపుణ్యా మెక్కడికి పోతుంది! యే పుట్టలో యే పామువుందో మనం చూశామా ?"

"సరే నీ యిష్టం. నువ్వు వెళ్ళిరా!...నాకు పనుంది నాతో కూర్చుంటే నీకు పనులెక్కడ అవుతాయి!"

మీనాక్షి ఆనందానికి హద్దులు లేవు. ఎన్నో రోజుల తర్వాత మీనాక్షి పెదాల మీద చిరునవ్వు చిందులేసింది. ఆమె ఆశ అందని వాటికోసం అఱ్ఱులు చాచింది.

కోళ్లు కూయక ముందే నిద్ర లేచింది. ఇంట్లో పని ముగించింది. స్నానంచేసి చీరె సింగారించి, కొబ్బరికాయ పూలతో సిద్ధమైంది. సూర్యోదయ సమయానికి ఇరుగమ్మను, పొరుగమ్మను తోడు తీసుకుని బయల్దేరింది స్వామి దర్శనానికి.

ఊరికి మైలు దూరంలో వుంది గుడి. పొలాల అవతల మఱ్ఱిచెట్టు. దాని అవతల మొగలి పొదలు. ప్రక్కనే పంట కాలువ దానిపైన పదిగజాల దూరంలో వుంది గుడి.

జనం వచ్చి తిరిగి వెడుతున్నారు. సహచరులతో బాలె లోనికెళ్ళింది మీనాక్షి. స్వామి ఓ ఉన్నతాసనంమీద ఆశీనులై యోగనిష్ఠలో నిమగ్నులైనారు. మిసమిసలాడే బంగారు దేహఛాయ, కాషాయ వస్త్రాలు, మెడలో రుద్రాక్షలు, కొట్టవచ్చే సన్నని కోరమీసం. మనిషిని చూస్తేనే మంత్రముగ్ధులవుతారా అన్పిచ్చేట్టుంది వారి రూపం.

మీనాక్షి వంతు రాగానే వెళ్లి స్వామిముందు మోకరిల్లి, భక్తితో భగవంతుని మనసారా ధ్యానిస్తోంది. స్వామి కళ్ళు తెరచి మీనాక్షిని వీక్షించాడు. భక్తురాలిమీద వాత్సల్యం పెరుగుతున్నది. స్వామిలో కళ్లార్పకుండ అట్లాగే మరికొద్ది క్షణాలు చూచాడు. మీనాక్షిమాత్రం కన్నులు మూసుకుని స్వామి ఆరాధనలో లీనమైంది. ఆ అమాయకురాలు దేనికోసమై అంత తీవ్రంగ భగవంతుని ధ్యానిస్తున్నదో స్వామి ఊహకు అందలేదు.

కళ్లు తెరచిన మీనాక్షి "స్వామీ! ఈ అభాగ్యురాలు బిడ్డలకోసమై తపిస్తున్నది. మాతృ ప్రేమకోసం తనువు ఆరాటపడుతున్నది. మోక్షమార్గ మేదయినా చూసి పుత్ర భిక్ష పెట్టండి" సవినయంగ అర్థించింది.

మీనాక్షి మాటలు ఆలకించిన స్వామి అప్రయత్నంగా చిరునవ్వు నవ్వాడు. పర్యవసానంకోసం పరాగ్గా పదినిముషాలు ఆలోచించాడు. ఆమె విచారవదనాన్ని చూచి జాలి పడ్డాడు. అనుకోనట్టుగ ఆలోచన మెరుపులాగ మెరిసింది.

"మీనాక్షీ ! రేపే పౌర్ణిమ. నన్ను దర్శించేందుకై జనం తండోప తండాలుగా వస్తారు. ఎంతో మంచిరోజు బిడ్డలకోసం అనవరతం పరితపించే వారికి యెంతోపర్వదినం.

పుత్రప్రేమ కోసం విలపించే పడతుల కోర్కెలు ఫలించే మధురదినం. కనుక సాయంసమయం ముగిసిన తరువాత పూవులు, పళ్ళు తీసుకుని, ప్రశాంతమైన మనస్సుతో నావద్దకువస్తే మహత్తరమైన మంత్రోపదేశం చేస్తాను. తరించి తల్లివవుదువుగాని. నే చెప్పినట్లుచేస్తే వక రక్షరేఖకూడ యిస్తాను. వెళ్ళిరా మీనాక్షీ" అనేసి ఆనాటికి కొలువు చాలించారుస్వామి.

ఇంటికొచ్చిన మీనాక్షి మళ్ళీ యెంత త్వరగ తెల్లవారుతుందాని యెదురుచూడ నారంభించింది. మీనాక్షితో పంతాలు పడని ప్రకృతి యథాతథంగానే తెల్లవారనిచ్చింది.

వేకువఝాముననే లేచి తలంటి పోసుకుని ఇంటినంతా శుభ్రపరచింది. పరమేశ్వరుని పటంముందు కూర్చుని మనసారా ధ్యానించింది.

సాయంత్రం ఆరుగంటలయ్యేసరికి పళ్ళూ, పూలు చిన్న బుట్టలో వుంచుకుని, నొసటన పెద్దబొట్టు పెట్టుకొని పొలం వెళ్ళబోయే భర్తపాదాలకు నమస్కరించి స్వామి దర్శనార్థమై బయల్దేరింది.

సూర్యాస్తమయం సమీపిస్తున్నది. చీకటి వెలుగుల మధ్య కాలచక్రం నడిపే భగవానునిలా నడుస్తున్నది మీనాక్షి అమాయక హృదయంతో. భయంకర రక్కసుల బోలినరోడ్డు కిరువైపులవున్న చింతచెట్లు మంగళగీతాలు పాడుతూ మీనా

క్షిని దీవిస్తున్నట్లు బరువుగ తల లూగిస్తున్నాయి. గూళ్ళకు చేరే పిట్టల సవ్వడి, మీనాక్షి అడుగుల చప్పుడు తప్ప ప్రకృతిలో మరి ఏ యితర శబ్దాలు లేవు.

మీనాక్షి కుడికన్ను అదర నారంభించింది. వినిర్మలమైన ఆమె హృదయంలో అవ్యక్తమైన బాధ ఆమెను పీడిస్తున్నట్లు ఆమె వదనం ద్వారా వ్యక్తమవుతున్నది. దూరంగా ఎక్కడో ఆకాశంలో కన్పడకుండా తీతువుపిట్ట అరుపు విన్పించింది. స్వామి దర్శనకార్యార్థమై పవిత్రమైన హృదయంతో వెళ్ళబడుతున్న మీనాక్షి ఏమిటే అపశకునాలు అన్పించింది మనసులో. భగవంతుని మనసారా ధ్యానిస్తు నడుస్తున్నది.

ఆలోచనా కడలిలో వూగులాడు తున్న మీనాక్షి భగవదనుగ్రహంవల్ల త్వరలో తల్లి కాబోతున్నాననే ఉబలాటంతో ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టింది.

పిండారబోసిన వెన్నెల, వన్నెలు చిన్నెలు కురిపిస్తున్న కన్నెలాగ కులుకుతు భూమ్యాకాశాలమధ్య నృత్యం చేస్తున్నట్లుంది. మలయపవనుడు తన వీణానాదాన్ని మృదువుగ, సొగసుగ పలికిస్తున్నాడు ప్రకృతిలో. కమ్మనిగాలికి చుట్టూదట్టంగా వున్న మొగిలిపొదలలో నుండి సువాసన గుబాళించి కొడుతున్నది.

ముగ్ధ హృదయంతో, అందంగా అలంకరించుకున్న మీనాక్షి ఆలయంలో అడుగు పెట్టగానే, అమరలోకంనుండి దిగివచ్చిన గంధర్వ కన్యలాగ మిలమిలా మెరిసిపోతున్నది.

తెల్లని వుల్లిపొర లాంటి చీరె వెన్నెల వెలుగులో లీనమై ఆమె లావణ్యానికి క్రొత్త సొంపును కలిగిస్తున్నది.

మంటపంమీద ఆసీనులైన స్వామిముందు మోకరిల్లిన మీనాక్షి వెంట తెచ్చిన పూలు, పళ్ళను స్వామి పాదాలవద్ద వుంచింది.

"వాచ్చావా మీనాక్షీ !" అంటు మృదువుగ పలుకరించాడు స్వామి.

భగవదారాధనలో లీనమైన మీనాక్షికి ఆ మాటలు సోకలేదు.

"మీనాక్షీ ! నీ కోరిక ఫలించే తుది ఘడియలు ఆసన్నమవబోతున్నాయి. ఎన్నో ఏళ్ళనుండి పరితపిస్తున్న నీ హృదయాన్ని పావనంచేసి, పుత్ర ప్రాప్తి కలుగచేదామనే ఆపేక్షతో, ఆకాంక్షతో నిన్ను నా దర్శనానికి రమ్మన్నాను గదూ ?—ఆహా... నిజంగ భగవంతుడు యెంతటి నిర్దయుడు! పుత్రకాంక్షతో విలపించే పడతుల ఆక్రందనాలను ఆలకించడేం ?"

"స్వామీ ! సంతానం కోసం తల్లడిల్లిపోతున్న ఈ తనువు యెంతోకాలం జీవిస్తుందనే ఆశకూడ నాకు లేదు... కానీ... ఆ అవసాన కాలం సమీపించకముందే సత్యస్వరూపులైన మీరు ఒకవరం ప్రసాదించండి ! నాలోవుండే ఆవేదన ఇంతకంటె ఏవిధంగ తమతో మొరబెట్టుకోవాలో తెలియడంలేదు."

"ఆవేశ పడకు మీనాక్షి ! నీ ఆవేదన అర్థంచేసుకోలేనంతటి అజ్ఞానిని కాను. అన్ని విషయాలు యిట్టే గ్రహించ

గల అమరతేజస్సు నాలోవుంది. కానీ నీ విషయంలోనే ముందు వెనుకలు ఆలోచించవలసి వస్తున్నది"

"నేనేంపాపం చేశాను స్వామీ!—స్వామీ ఆలస్యం చేసిన కొద్దీ నా హృదయావేదన మరింత ఎక్కువవుతుంది. త్వరగ మంత్రోపదేశంచేసి తరింపజేయండి..." అంటు మళ్ళీ కళ్ళు రెండు మూసుకుని భగవంతుని ధ్యానిస్తున్నది.

తల్లికావాలనే ఆపేక్షతో భగవధ్ధ్యానంలో లీనమై ఐహికబంధాలనుండి మనస్సు దూరం చేసుకుని భక్తి పార వశ్యంలో తనను తాను మరచిపోయింది మీనాక్షి.

తామరతూడువంటి మీనాక్షి కోమలకరాన్ని స్వామి చేతిలోకి తీసుకుని నాడి పరీక్షచేయ నారంభించాడు. స్వామి అంతరంగంలో సంచలనం బయల్దేరింది. ఎడమచేతితో కోర మీసాన్ని మెలివేశాడు. ధరించిన కాషాయి వస్త్రాలకేసి ఓమారు చూచి నవ్వుకున్నాడు. ఒళ్ళు మరచి భగవదైక్యా నికి దగ్గరయి సమస్తం అర్పించేందుకు సిద్ధమై వచ్చి పాదాల ముందు మోకరిల్లిన మీనాక్షిని చూచి కళ్ళు పెద్దవిచేశాడు.

పరీక్షిస్తున్న మీనాక్షి వామహస్తాని సున్నితంగ హృదయానికి హత్తుకున్నాడు స్వామి. సంపెంగపొదల మీదుగ వీచే సువాసన స్వామిని ఉద్రేకపరచి మత్తెక్కిస్తున్నది. వళ్ళంత గగుర్పొడిచినట్లనిపించింది.

"మీనాక్షీ!" పిలిచాడు స్వామి.

మీనాక్షి బదులు పలుకకపోవటంతో అమరత్వానికి దగ్గరవుతోందేమో అనుకున్నాడు స్వామి.

"మీనాక్షి! నీభక్తి అపారమైనది. అన్యులకు సాధ్యం కాని అమరతేజస్సును, నీలో ఐక్యం చేసుకోగలిగావు. బిడ్డలు లేని కొరత తప్పక తీరుతుంది. ఆ శుభఘడియ కోసమే నిన్ను రమ్మంది" అంటు బొడ్లోని విభూతితీసి మీనాక్షిమీద చల్లాడు.

అచంచలంగ వున్న మీనాక్షిని తదేకంగా చూస్తూ "మీనాక్షి! నీ కోరిక ఫలించి, నాకు సంతోషం లభించే మధురక్షణాలు ఆసన్నమయినయి. లే మీనాక్షీ!—లే!—ధన్యురాలవు!" అంటూ ఆమెను తాకాడు స్వామి.

అమరత్వానికి దగ్గరయింది మీనాక్షి.

"ఏమిటీ మూఢభక్తి? చాలు యికలే!" అన్నాడు స్వామి యెంతకీ మీనాక్షిలో చలనం కన్పించనందుకు.

స్వామి ముందు మోకరిల్లిన మీనాక్షి అచేతనంగ పడిపోయింది. బాధతో సన్నగ మూలగటం స్వామికి విన వచ్చింది. కూర్చున్న వాడల్లా స్వామిలేచి గవాక్షంగుండా మంటపంలోకి ప్రసరిస్తున్న వెన్నెల వెలుగులో మీనాక్షి మొహం పరీక్షించాడు. నోటివెంట నురుగు వస్తోంది. భయంతో స్వామి వణికిపోయాడు. మీనాక్షి కూర్చున్న ప్రదేశానికి పదిగజాల దూరంలో పడగవిప్పిన నాగుపాము నాట్యంచేయటం గమనించిన స్వామికి పరిస్థితి అర్థమైంది.

నిరుత్సాహపడిన స్వామి ప్రాణభీతితో ఆరుబయట ప్రదేశంలోకి పరుగెత్తాడు.